# మనిషీ - పశువూ

పొద్దున జరిగిన గొడవను గురించి ఆలోచిస్తున్నాడు రామిరెడ్డి. ఇంతకు ముందు కూడా ఆవిషయంలో వాళ్ళిద్దరూ మాటా మాటా విసురుకున్నారు. కానీ, ఇంతవరకూ రాలేదు. ఈ రోజు నలుగురూ పోగై వింటున్నా అరుచుకున్నారు! వింటున్న వాళ్ళు తన మొగం చూస్తున్నా తనేమీ మాట్లాడలేదు. తండ్రి దిక్కు చెప్పాల్నా, కొడుకుదిక్కు చెప్పాల్నా అనేదొకటే కాదు సమస్య. వాళ్ళ వాదానికి కారణమైన విషయం కూడా అట్లనేవుంది. తండ్రి చెప్పేది తరతరాలుగా వస్తున్న పద్ధతి, ఆ పద్ధతి ప్రకారమే వుండాలనేది ఆయన వాదం. తరతరాలుగా వస్తున్నా సరైన పద్ధతి కాదని తెలిసినాక మార్చుకోవాల, మార్చుకుందాం ....... అనేది కొడుకు వాదన. రెండూ ఒకదాని కొకటి విరుద్ధంగావుండీ, రెండూ మంచివేననిపిస్తుండడం వల్ల ఏది సరైందో తెలీడం లేదు.

ఇంటిముందు నులకమంచంలో కూచొనున్న రామిరెడ్డి కొంచెం అశాంతిగా కదిలి, తలాపునున్న అగ్గిపెట్టె, బీడీ తీసి ముట్టించినాడు. అగ్గిపెట్టె మళ్ళా తలాపు దిక్కు విసిరేసి, కుడివైపు వత్తిగిలి పండుకొని కాళ్ళు చాచుకుని, ఎడంచేతిలో వున్న బీడీని పీలుస్తూ వుండిపోయినాడు. మసక మసక చీకట్లు కమ్ముతున్నాయి. గోడకున్న కొయ్యల మీద కోళ్ళు ఉడగ బోయే ముందు తావుకోసం చేసే చిన్న చిన్న పోట్లాటలు, సర్దుబాట్లు, సంటెన్నగారి జీతగాడు దొడ్లో నుంచీ బరెగొడ్లను ఇంటికి తోలకపోతూ; వాటిని నానాతిట్లూ తిడుతున్నాడు. బరెగొడ్లు ఒకదానికొకటి రాసుకుంటూ, దుమ్మురేపుకుంటూ, ఉచ్చలు పోసుకుంటూ, పేడకళ్ళు పెడుతూపోతున్నాయి. గాలిలో కమ్ముకున్న బరెగొడ్ల పేడ, ఉచ్చవాసన. రెండు మూడు బారల దూరంలో ఉలిపికోడెకు ఉడుకు నీళ్ళతో పయి కడుగుతున్న కిట్టన్న. ఈరోజు దిగబడుతున్న దావగుండా సేనికి ఎరువుతోలినాడు. బరువు పనిచేసినప్పుడు, ఎద్దులకు ఉడుకు నీళ్ళతో

పయి కడుగుతాడు కిట్టన్న. ఇంట్లో ఆడవాళ్ళుకానీ ఉడుకు నీళ్ళు లేవంటే తను ఉడికి పోతాడు. "పొద్దున అయిమళ్ళాపన్జెయ్యాలా? వద్దా?" అని పోట్లాడతాడు. అందరూ కూడా వున్నప్పట్నించీ ఇప్పటిక్కూడా అంతే కిట్టన్న. అంతకుముందు రేగిన దుమ్ముతో పాటు వచ్చిన బరెగొడ్ల పేడ, ఉచ్చ వాసన బదులు ..... ఉడుకు నీళ్ళు పీల్చుకుంటున్న దుమ్ము నుంచీ వస్తున్న మంచివాసన. రామిరెడ్డి వీటిని గమనిస్తూనే వున్నాడు. ఇంకో పక్కన బీడీ నుంచి వీచే సన్నని పొగ మాదిరి ఆలోచన పాగుతూనే వుంది.

"మనుసులూ పసులూ కల్సివుండడమనేది మా అబ్బబ్బల తరాల నుంచీ వుందిక్కడ. నువ్వు జెప్పినట్టూ పసుల్తో వుంటే రోగాలొచ్చేది నిజమైతే, వాళ్లెవరూ బతికి వుండగూడ్దు మల్ల. యాన్నో పసులు యేరుగా మనుసులు యేరుగా వుండారని, మనమూ అట్లనే వుండాల్నా? ఎక్కడి పద్ధతి అక్కడ్డి. ఇది మంచిది కాదని వాళ్ళంటే, వాళ్ళది మంచిది కాదని మనమంటాం.' ఇది పెద్దాయన వాదం. "యాన్నో పసులు యేరుగా, మనుసులు యేరుగావుండారని" అని ఆయననే మాటల వెనుక ఒక కత వుంది. నిజానికి అది జరక్కపోతే, పసులు వేరుగా వుండాలని మధు అంతపట్టుపట్టేవాడు కాదేమో! పట్టు పట్టడం దాకా ఎందుకు, ఆ ఇద్దరూ రాకముందు ఎన్నడూ ఆ మాట కూడా అన్లేదు. వాళ్ళిద్దరూ అన్నాకనే ఇక్కడి పద్ధతి సరైనది కాదని తెలిసిందా? లేక, అంతకు ముందు నుంచీ తనలోపలున్న ఆలోచనకు వాళ్ళిద్దరూ బలమిచ్చినారా? రెన్నెళ్ళ కిందట 'వాళ్ళిద్దరూ' వచ్చి వారం రోజులున్నప్పుడు జరిగిందంతా మనసులో తిరిగింది రామిరెడ్డికి.

ఇద్దరివీ పల్లెటూళ్ళేనంట. ఒకర్ది గుంటూరుజిల్లా, మరొకర్ది కృష్ణాజిల్లా, వ్యవసాయ కుటుంబాలలోనివాళ్ళే. హైదరాబాద్‌లో జరిగిన వ్యవసాయ శాస్త్రజ్ఞుల సదస్సుల్లో మధుకు పరిచయమైనారట. ఆ పరిచయం స్నేహమై ముగ్గురూ జాబులు రాసుకునేవరకూ వచ్చింది. వాళ్ళ జాబుల్లో రాయలసీమను గురించి ఏవేవో అడిగేవాళ్ళు, కొన్ని మధు చెప్పేవాడు. రాయలసీమ కొట్లాటల్లో ఆడోళ్ళూ, పిల్లోళ్ళూ కూడా బాంబులు వేసుకుంటారట కదా..... అని అడిగేవాళ్ళు. ఇండ్లలోనే అవేవో పిండివంటలు చేసుకున్నట్లు, అందరూ కూచొని బాంబులు చేసుకుంటారటగదా ..... అనడిగేవాళ్ళు. భర్తను చంపిన వాళ్ళను చంపే వరకూ బొట్టు తుడవననీ, జుట్టు ముడవననీ భార్య ప్రతిజ్ఞ చేసి, సాధించాక విధవలౌతారటగదా.... అనడిగేవాళ్ళు. ఇట్లా ఏవేవో! ఆ ప్రశ్నలకు నవ్వుకునేవాళ్ళు. "రాయలసీమలో వుండే కరువుల గురించిన సమాచారం కన్నా ఇట్లాటి కతల ప్రచారం బాగా జరుగుతావున్నెట్లుంది. ఇట్టాంటి కతలు సర్కారోళ్ళకు బాగా ఇష్టంగా వుంటాదిలే" అన్నాడు పెద్దాయన. "పత్రికలూ, సినిమాలూ చూసి వాళ్ళు అట్లా అనుకుంటున్నట్లుంది" అన్నాడు మధు. వాళ్ళ ప్రశ్నలకు జవాబుగా, "ఒకసారి మావైపు వచ్చి చూసివెళ్ళండి. అటువంటి వాటిలో నిజమెంతో, కల్పనెంతో మీకే తెలుస్తుంది" అని మధు రాయడంతో వాళ్ళొచ్చినారు.

వాళ్ళు వేటినైతే చదువుతూ వింటూ ఆశ్చర్యపడుతూ వచ్చినారో ....... అవన్నీ అట్లా లేవని వాళ్ళకు అర్థమయింది. ఇక్కడి వాళ్ళు జేబుల్లోనో, చేతి సంచుల్లోనో బాంబులు వేసుకుని వుంటారనుకునేంతగా వాళ్ళు ఊహించుకున్నట్లుంది. తీరా చూస్తే ........ ఇక్కడి వాళ్ళకూ మంచీ మర్యాదా తెలుసుననీ, మామూలు మనుషులూ, కొట్లాటలు ఏమాత్రం ఇష్టంలేని వాళ్ళూ ఎంతో మంది వున్నారనీ, ఎవరూ చెప్పకుండానే అర్థమయింది. ముఠాకక్షలూ, వాళ్ళు చేసుకునే హత్యలూ, జరిపే దారుణాలూ లేవనికాదు. కానీ ఇక్కడ బాంబులు నిత్యావసరవస్తువు లైనట్టూ, మొత్తం సామాజిక జీవితమే కక్షలమయమయినట్టూ జరుగుతున్న ప్రచారానికి వాళ్ళు ఆశ్చర్యపోయినారు. ఆంధ్రదేశంలోనే వున్న ఒకభాగాన్ని గురించి ఏ ప్రయోజనం కోసం యీరకమైన ప్రచారం సాగుతున్నట్లు? అని కూడా చర్చించుకున్నారు. ఇక్కడికి వచ్చి చూడకపోతే, తామువిన్న కథలన్నీ నిజమేనని నమ్మే వాళ్ళమే కదా .... అనుకున్నారు. ఇదంతా వాళ్ళలో వాళ్ళుగాక, తమతో కలిసి మాట్లాడ్డం వల్ల తెలిసింది.

అంతవరకూ రాయలసీమను గురించి వాళ్ళకుండిన ఆశ్చర్యం ఆవిధంగా తేలిపోతే ఇంకో కొత్త ఆశ్చర్యం పట్టుకుంది. పూర్వపు ఆశ్చర్యం యీ ప్రాంతాన్ని చూసిన తర్వాత పోగా, యీకొత్త ఆశ్చర్యం చూసిన తర్వాత వచ్చింది. ఇక్కడ మనుషులూ పశువులూ కలసివుండడం, చూడకపోతే నమ్మకపోయేవారట. ఈ ఆశ్చర్యం వాళ్ళు ఇక్కడున్నన్ని రోజుల్లోనూ తగ్గనేలేదు. ఆ ప్రస్తావన తెచ్చినప్పుడల్లా అదే ఆశ్చర్యం.,

"ఇక్కడి వూళ్ళల్లో అంతా ఇంతేనా? ఇంట్లోనే వుంచుకుంటారా?" అప్పటికి ఎన్నోసారో ఆప్రశ్న అడగడం!

"ఆ ..... అన్ని వూళ్ళల్లోనూ ఇంతే" అన్నాడు మధు. ఆ జవాబు కూడా అంతకుముందు చెప్పిందే. "ఇంతేనా?" అని అడగడమూ, "ఇంతే" అంటే 'అంతే' ఆశ్చర్యపడడమూ! అయితే, అప్పుడు ఆశ్చర్యాన్ని దాటేసి కొంచెం ముందుకు పోదామనుకున్నట్లుంది.

"ఎందుకని ఇలా పశువుల్తో కలసి వుండడం?"

"ఎప్పట్నించో ఇట్లావుంటున్నారు" అన్నాడు మధు.

"అదే, ఎప్పట్నించో ఇప్పటి వరకూ ఎందుకుంటున్నట్టు?" అనడిగినాడు ప్రసాద్.

"నీలాంటి చదువుకున్నోళ్ళయినా ఇది మంచిది కాదని చెప్పొచ్చుగా" అన్నాడు భానుమూర్తి. మధు ఏం జవాబు చెప్పేవాడోకానీ, వాళ్ళబ్బ(1) మధ్యలో వచ్చినాడు.

"సదువుకున్నోళ్ళొచ్చి ఏం సెప్పాలంటావ్ మాకు?" నవ్వుతూనే అడిగినాడు కానీ, నిలదీస్తున్నట్లుగానూ, కొంచెం ఎగతాళి చేస్తున్నట్లుగానూ వుంది. ఆయనకప్పటికే లోలోపల వాళ్ళమీద కోపంగా వుంది. పసులు ఇండ్లల్లోనే వుండడం వాళ్ళకు కొత్తగా వుంది. అయితే

1. తండ్రి తండ్రి, అంటే రామిరెడ్డి తండ్రి... అంటే ఇందులో 'పెద్దాయన' అయిన శివారెడ్డి

మాత్రం ఇన్నిసార్లు అదే అదే అడగడమేంది? అని తనకూ కొంచెం విసుగ్గానేవుంది. ఇంతకుముందు అప్పుడప్పుడూ వచ్చిన సర్కారుప్రాంతం ఉద్యోగులూ వాళ్ళు కూడా దీన్ని వింతగానే చూసినారు. అయితే, "ఏదో వీళ్ళ పద్ధతిలే" అనుకున్నట్లు వూరుకున్నారుగానీ, వీళ్ళ మాదిరి గుచ్చి గుచ్చి అడగలేదు. వీళ్ళది కొంచెం 'పిల్లయెవారంగా వుంది' అనిపించింది. అందుకే వాళ్ళనాయన అడిగిన దాంట్లో తప్పేంలేదనుకున్నాడు. వాళ్ళను గురించి తామేమనుకుంటున్నదీ వాళ్ళకు తెలిసినట్టేలేదు.

"పశువుల్ని మనతోపాటు వుంచుకోకూడదుకదండీ" అన్నాడు భానుమూర్తి. "ఎందుకుంచుకోకూడదూ?" అని వత్తి అడిగినాడు ఆయన. నేరుగా వాళ్ళతో వాదానికి దిగినట్టుంది. వాదానికి దిగినాడంటే ఆయన భలేమొండి. "శివారెడ్డితో వాదానికి దిగితే అవతలోడింక అయిపోనట్టే" అంటుంటారందరూ.

"ఆరోగ్యానికి మంచిదికాదుకదండీ......" అన్నాడు ప్రసాద్.

"ఏం మా ఆరోగ్యాలకేమయింది? ఇక్కడోళ్ళు ఒక్కొక్కరు డెబ్బయ్యేళ్ళు ఎనభైఏండ్లు బతికినారు. ఎప్పుడన్నా ఎవరికన్నా రోగాలొచ్చినా, పసుల్తో కల్సివుండడం వల్ల రోగాలొచ్చినట్టు డాక్టర్లు అప్పుడూ సెప్పలా, ఇప్పుడూ సెప్పలా"

"అయితే కలిసి వుండొచ్చని ఏ డాక్టరన్నా చెబుతాడేమో కనుక్కుందామా?" అన్నాడు భానుమూర్తి.

"అక్కర్లేదు, డాక్టర్లు చెప్పింటే మేం వుండడం లేదు. వాళ్ళో, మీరో వద్దంటే వుండకుండా పోం. అట్లా వుండొద్దని మీ పక్క డాక్టర్లయితే సెప్తారేమోకానీ, మా పక్క డాక్టర్లయితే సెప్పరు. ఎందుకంటే, వాళ్ళు మనుసులూ పసులూ కల్సివుండిన ఇండ్లల్లో నుంచి వచ్చినోళ్ళే" "అయితే మాత్రం ఎందుకు చెప్పరు? ఆరోగ్య సలహాలకు మా పక్క మీపక్క అనేదేముంది?"

చర్చ, 'మీ పక్క మా పక్క' అనే ధోరణిలోకి దిగడం ప్రసాద్‌కేమీ నచ్చినట్లులేదు. "ఇంక అంతటితో ఆపు" అన్నట్టు భానుమూర్తికి సైగ చేసినాడు. ఈ లోపల పెద్దాయన ఇంగో సవాల్ విసిరినాడు.

"పోనీ.........మీ పక్క పసుల్ని కడగా పెట్తారు కదా, మీకేం రోగాలు రావడం లేదా మల్ల?"

ఇంత కటువుగా మొరటుగా అడగడం మధుకు నచ్చినట్టులేదు, ముఖం చిట్లించుకున్నాడు.

"పోనీండి.............. ఇది వాదంతో తెగేదికాదు. ఇక్కడి పద్ధతి ఇదీ, అక్కడి పద్ధతి అదీ' అని సర్దిచెప్పాడు ప్రసాద్.

"అక్కడి పద్ధతి అదీ, ఇక్కడి పద్ధతి ఇదీ సరే. ఆ సంగతి తెలుస్తోంది. అయితే, అక్కడా పద్ధతీ, ఇక్కడీ పద్ధతీ ఎందుకున్నట్లు? కారణాలేమిటి? ఏ పద్ధతి మంచిది? అని ఆలోచించడం

తప్పేంకాదుగా. అందులో వివాద పడాల్సిన అవసరమేముంది?" అనడిగినాడు భానుమూర్తి. " ఏపద్ధతి మంచిదంటే, ఎవరి పద్ధతి వాళ్ళకు మంచిది" అన్నాడు పెద్దాయన. ఆయన ఆ మాత్రం సర్దుబాటు చూపడంతో అదే అదననుకున్నాడేమో...... "అదే నేను చెబుతున్నదీ" అన్నాడు ప్రసాద్ కొంచెం గట్టిగా, అసాధారణంగా, భానుమూర్తి ప్రసాద్ కేసి కొంచెం చిరాగ్గా చూసి, ఆ తర్వాత చిరునవ్వుతో అన్నాడు ...............

"ఎవరి పద్ధతి వాళ్ళకు మంచిదిగా వుండదు ప్రసాద్! మంచి పద్ధతి మాత్రమే అందరికీ మంచిదిగా వుంటుంది"

ప్రసాద్ మాట్లాడలేదు. ఈ మాట మధుకు నచ్చినట్లుంది, ముఖం చూస్తే తెలిసింది. భానుమూర్తి అదే నవ్వుతో పెద్దాయన దిక్కు చూస్తూ అన్నాడు.

"పశువులూ మనుషులూ కలసి వుండకూడదనేది మనుషుల ఆరోగ్యానికి సంబంధించిన అంశ. అలా వుండటం వల్ల మాకేం రోగాలొచ్చాయనీ, అలాలేనందువల్ల మీకే రోగాలూ రాలేదా అనీ అడగడం సరికాదు. ఎందుకంటే, ఆ దృష్టితో పరిశోధిస్తే తప్ప అవి తేలేవి కావు. అటువంటి పరిశోధన లేవీ ప్రత్యేకంగా జరగలేదు కనుక, మనుషులూ పశువులూ కలసి వుండటంలో ఏ హానీ లేదనుకోరాదు. ఏ పరిశోధనలూ అక్కర్లేని ఆరోగ్య సూత్రాల కందే 'సింపుల్' విషయం అది. అనారోగ్యంతో ఎక్కువ కాలమూ బతకొచ్చు, ఆరోగ్యంతో వుండి త్వరగా మరణించనూ వచ్చు. అయినా ఆరోగ్యంగా బతకడాన్నే కోరుకుంటాం. అలాగే, మనుషులు మనుషుల లాగా బతకడాన్నే కోరుకుంటాం............"

ఆ చివరి మాటతో పెద్దాయన ఉగ్రుడయినాడు.

"అయితే మేం మనుషులం కాదంటావ్, మనుషుల మాదిరి బతకడం లేదంటావ్! మీ సర్కారోళ్ళకున్న రోగమే ఇది. మేమే మనుషులం, మేమే తెలివైనోళ్ళం. వచ్చిన కాన్నుంచీ 'ఇక్కడంతా ఇంతేనా' అనే పల్లాయి ఇడ్సకుండా వుండింది ఇందుకేనా?మేం మనుషుల మాదిరి బతకడం లేదనేందుకేనా? అవతలి మనుషుల్ని ఇట్లనే వాళ్ళు ఏం మనుషులు? మా రోగాల సంగతి కాదు, మీ రోగం బాగుసేసుకోండి ముందు" అని కేకలేస్తూ ఇంట్లోకి పోయినాడు.

"నే చెప్తే విన్నావా?" అన్నట్టు ప్రసాద్ భానుమూర్తి ముఖం చూసినాడు. భానుమూర్తి ఇంకా నవ్వుతున్నా, లోపల కొంచెం బాధపడుతున్నట్టుంది.

'నేను ఇక్కడివాళ్ళనుద్దేశించి ఆమాట అన్లేదు, 'జనరల్'గా చెప్పాను. ఆయనింకో విధంగా అర్థం చేసుకున్నారు. ఆ చివరి మాట అనకుండా వుండవలసిందేమో" అని నొచ్చుకున్నాడు.

"చివరి మాటేకాదు, ఆ ప్రస్తావనే ఇంతవరకూ రానిచ్చి వుండవలసిందికాదు" అన్నాడు ప్రసాద్. ఆ ప్రస్తావన తేవడమే తప్పనుకుంటున్నట్లు లేదు కానీ, భానుమూర్తి అప్పుడేం

మాట్లాడలేదు. మధు స్నేహితులుగా యీ ప్రాంతం చూడవచ్చిన వాళ్ళతో ఇటువంటి చర్చ జరగడమూ, ఇబ్బందికరమైన పరిస్థితి ఏర్పడడమూ తనకు బాగా లేదనిపించింది. భానుమూర్తి, పెద్దాయన అనుకున్నట్టుగా ఇక్కడివాళ్ళను అవమానించడానికి ఆ మాట అనలేదని అర్థమయింది. అంతేకాదు, తను అంతకు ముందు అనుకున్నట్టు వాళ్ళది 'పిల్లయెవారం' కాదనీ అర్థమయింది. అందుకే వాతావరణాన్ని మామూలుగా మార్చేందుకు ఒక మాటన్నాడు.

"పసుల్తో కల్సి వుండడం మంచిది కాదంటే, మరి పట్టణాల్లో కుళ్ళు కాల్వల పక్కన పందుల్తో కల్సి వుండే వాళ్ళ సంగతో?" భానుమూర్తి తనదిక్కు చూసినాడు. జవాబు చెప్పాలా, వద్దా అని ఆలోచించిచెప్పినట్టుంది.

"వాళ్ళు గత్యంతరం లేక వుంటున్నవాళ్ళు. వాళ్ళ ఆరోగ్యం మీద ఆ ప్రభావం లేకుండా వుండదు. ఇక్కడా గత్యంతరం లేక పశువుల్తో కలసివుంటున్న వాళ్ళూ వుండొచ్చు. పశువుల్ని వేరుగా వుంచగలిగే అవకాశంవుండీ, కలసివుండడం గురించి మనం మాట్లాడుతున్నది. ఇక్కడయీపరిస్థితి ఎందుకున్నట్టు? కారణాలేమిటి?" తన ప్రశ్నలో వున్న పొరపాటు అర్థమయింది.

"ఎందుకుంటున్నట్లో నువు చెప్పుమల్ల" అంటూ మళ్ళా వచ్చినాడు పెద్దాయన.

"అమ్మయ్య.........! మీరింక మాతో మాట్లాడరేమో, మా ముఖమే చూడరేమో అనుకున్నాను" అన్నాడు భానుమూర్తి. తనూ, మధూ, ప్రసాదూ కూడా నవ్వినారు.

"అది సరేలే........ నేనడిగిందానికి జవాబుచెప్పు?" అన్నాడు కసిరినట్లు.

"అది మీరు చెప్పాలి, నేనుకాదు" అన్నాడు భానుమూర్తి.

"నేచెప్పేది చెప్తాలే. మేమిట్లా ఎందుకున్నట్టో, నువ్వేమనుకుంటున్నావో ముందుచెప్పు?"

భానుమూర్తి 'మీరు' అంటున్నది గమనించకుండా ఆయన అతన్ని 'నువ్వు, నువ్వు' అనడం బావున్నట్లు లేదు మధుకు. "ఇక్కడ 'నువ్వు' అనడమే అలవాటు" అని వివరించాడు.

"దాన్దేముంది? వారు పెద్దవారు. నువ్వు అన్నా నేనేం అనుకోను"

"అనుకునేదేముంది? మీ బాస తడిగుడ్డతో గొంతుకోసే రకం దొంగ బాస. మాది సూటిగా వుంటాది. 'నువ్వు వెధవవు' అంటాం మేము. మీరైతే 'మీరు వెధవలండీ' అనాల............." భానుమూర్తి గట్టిగా నవ్వినాడు.

"నేనడిగిందానికి చెప్పనేలేదు" అని తగులుకున్నాడు మళ్ళా. ఒక్కనిమిషం మౌనంగా వుండి, తర్వాత నెమ్మదిగా అన్నాడు భానుమూర్తి.

"మనుషులూ పశువులూ కలిసివుండకూడదన్న ఆలోచన రాకపోవడం వల్లనే ఇలా వుంటున్నారనుకుంటున్నాను. లేకపోతే, స్థలమూ డబ్బూ వున్న వాళ్ళు కూడా ఇలా వుండడానికి మరో కారణం కనిపించడంలేదు"

"అంటే, ఇక్కడోళ్ళంతా తెలివితక్కువోళ్ళనేకదా!"

"తెలివి తక్కువ వాళ్ళు అనడం లేదు, ఆలోచన రాలేదంటున్నాను"

"ఎట్లంటే ఏందిలే. తెలివి లేకనే గదా ఆలోచన రాన్ది"

"కాదు, అవి రెండూ వేరు వేరు............."

"ఇదో మీ యీ తెలివితోనే మీకూ మాకూ మొదట్నించీ కుదర్దనీ మీతో వేగలేమనీ, మేం వేరుగా వుంటామనీ మా వాళ్ళు మొత్తుకున్నా, మీ సర్కారు పెద్దోళ్ళంతా కల్సి మా వాళ్ళ మెడలు వంచి వప్పందం కింద పెట్టినారు. ఏమయింది? కోస్తా జిల్లాలతో పాటు రాయలసీమ కూడా అభివృద్ధి చెందేవరకూ పదేండ్లపాటైనా సరే, ఇంగా ఎక్కువైనా సరే నీటి పారుదల సౌకర్యం ఏర్పాటు చెయ్యాలన్నారు. ఇప్పుడు మీరు ఏడాదికి రెండు పంటలు పండిచ్చుకుంటా వుంటే, మేం ఏటా కరువుల్లో చచ్చిపోతున్నాం. మాకు పని కొచ్చే ప్రాజెక్టులకు మాతోనే ఎగనామం పెట్టిచ్చి, మీకు అవసరమైనవి కట్టుకున్నారు. ఇప్పుడు క్రిష్ణ నీళ్ళు కూడా మాకు రాకుండా చెయ్యాలని పులిచింతలను తీసుకొచ్చినారు......." గసతోనో, ఆవేశంతోనో ఆగినాడు. ఆయన మొదట కృష్ణాపెన్నార్ ప్రాజెక్టు కోసమూ, తర్వాత నందికొండ ప్రాజెక్టు కోసమూ ఆందోళన జరిపినవాడు. సందర్భం వచ్చినప్పుడల్లా సర్కారు వాళ్ళు రాయలసీమను ఏట్లా మోసం చేసిందీ చెబుతూనే వుంటాడు. ప్రసాద్‌కు కానీ, భానుమూర్తికి కానీ యీ చరిత్ర అంతా తెలిసినట్టులేదు. ఇటు రాయలసీమ వారికి కానీ, అటు తెలంగాణా వారికి కానీ సర్కారు ప్రాంతం మీద కోపం వుందని మాత్రం తెలిసినట్టుంది. ఆ కోపాన్నే యీయన తమ మీద చూపుతున్నాడని గ్రహించినట్టువుంది.

"సర్కారు వాళ్ళు మోసం చేశారని రాయలసీమ వాళ్ళూ అంటున్నారు, తెలంగాణా వాళ్ళూ అంటున్నారు. మరి తెలంగాణా వాళ్ళు ముఖ్యమంత్రులయ్యారు. రాయలసీమ వాళ్ళయితే ముఖ్యమంత్రులే కాదు, రాష్ట్రపతులే అయ్యారు. సర్కారు వాళ్ళ అన్యాయాల్ని వీళ్ళెందుకు అడ్డుకోలేదు?" అనడిగినాడు ప్రసాద్.

"మావాళ్ళు మంచోళ్ళయితే మా గతి ఇట్లెందుకుంటాది? వాళ్ళకు పదవి కావాల. ఆ పదవిలో నిలబెట్టేది, దించేదీ సర్కారోళ్ళు. అందువల్ల వాళ్ళు ఆడమన్నట్టే ఆడతారు. పదవిలో వున్నంత కాలమూ పల్లెత్తు మాట అనరు. పదవి వూడిపోయి వూళ్ళకొస్తానే, 'రాయలసీమకు అన్యాయం జరిగింది, ఆందోళన చెయ్యాల' అంటారు.

"మరి ఇక్కడి వాళ్ళే మోసం చేస్తున్నప్పుడు వాళ్ళనే మడుగుతున్నారు?"

"అడుగుతున్నాంలే. అయినా అసలు మోసగాళ్ళు మీ వాళ్ళు గదా" మధుకు ఆయన వరస నచ్చినట్టు లేదు.

"మన దిక్కు ఇండ్లల్లోనే పసుల్ను వుంచుకోడం గురించి వాళ్ళడిగినారు. దానికీ రాజకీయాలకూ ఏం సంబంధం?"

"సంబంధం లేకుండా ఎట్టపాయు? మనం ఇండ్లల్లోనే పసుల్ను ఎందుకు పెట్టుకున్నట్టు? అయి మనలో భాగం. మనకు పాలిచ్చే ఎనుముచస్తే అమ్మ చచ్చినట్టూ, సేద్యం చేసే ఎద్దు చస్తే నాయన చచ్చినట్టూ వుంటాది. మనకూ పసులకూ అట్టాటి సంబంధం. అందుకే మనం వాటిని కడగాపెట్టం, అసలా ఆలోచనేరాదు మనకు. ఒకరకంగా ఆయన చెప్పింది-నిజమే, అయితే ఆలోచన రాన్ది అందుక్కాదు. మన ఆరోగ్యం కన్నా పసులు ముఖ్యం మనకు. వాళ్ళ కట్లాకాదు, అయి ఆస్తిలో భాగం. పశువు చస్తే, ఎంత నష్టమయిందీ లెక్క వేసుకుంటారు. వాటి కన్నా వాళ్ళ ఆరోగ్యం ముఖ్యం వాళ్ళకు. అందుకే వాటిని కడగా పెడ్తారు. అదే వాళ్ళకూ మనకూ వున్న తేడా. ఇంగ దానికీ రాజకీయాలకూ ఏం సంబంధం అంటావా? రాజకీయాలలో వాళ్ళెంత స్వార్థపరులో, ఇందులోనూ అంతే. మనుషుల మాదిరి బతుకుతున్న దెవరు? వాళ్ళా, మనమా?" ఆవేశంతో మాట్లాడి, ఆ ఊపున భుజం మీదున్న తుండుతీసి విదిలించుకుంటూ పోయినాడు. ఆయన మాటల్ని వాళ్ళు శ్రద్ధగా విన్నారు. కొంచెం సేపు ఆయన చెప్పిన దాన్ని గురించి ఆలోచిస్తున్నట్లు ఏం మాట్లాడలేదు. తర్వాత భానుమూర్తి తన దిక్కూ, సుధు దిక్కూ చూస్తూ మాట్లాడినాడు.

"ఇక్కడ పశువుల్ని ఇళ్ళలోనే ఎందుకుంచుకుంటారో ఇప్పుడు కొంచెం అర్థమయింది. అయితే, పశువుల్ని ఎంతగా ప్రేమించినా పశువులూ మనుషులూ ఒకటికాదు. ఆలోచించే గుణమనేది పశువుల్నించీ మనల్ని వేరుచేసింది. అవీ మనమూ సమానమెలా అవుతాం?"

"సరే.......... ఇప్పుడు దాన్ని గురించి ఎంత ఆలోచించినా చేసేదేముంది? ఇక్కడి వాళ్ళు ఇళ్ళలోనే పశువుల్ని వుంచుకుంటున్నారు. అందుకు పెద్దాయన చెప్పిందే కారణమో........... ఇంకేదన్నా వుందో తెలీదు. ఇంతటితో యీ చర్చను ఆపేద్దాం." అన్నాడు ప్రసాద్. అన్నట్టూ వాళ్ళు వెళ్ళే వరకూ దాన్ని గురించి మాట్లాడలేదు. ఇక్కడ ఇండ్లల్లోనే పసుల్ను వుంచుకోడ మొక్కటే వాళ్ళకు ఆశ్చర్యంగా కనిపించలేదు. ఇంకోటి కూడా ఆశ్చర్యం కలిగించింది. ఎంత పెద్ద ఇల్లయినా, ఇంట్లో ఎంతమంది భార్యాభర్తలున్నా, వాళ్ళకు విడిగా గదులంటూ లేకపోవడం కూడా వింతగానే కనిపించింది. ఆ విషయం అడిగితే "ప్రత్యేకంగా గదులెవరికీ వుండవు" అని చెప్పారు.

"గదుల్లేకపోతే .......... ఎలా ........ ఎలా......." అని ఆగిపోయినారు. వాళ్ళ ముఖాలు చూస్తే నవ్వొచ్చింది. "కొత్తగా పెళ్ళయిన వాళ్ళకూడా వుండవా?" అనడిగినారు చిన్నగా. "వుండవు, కానీ వాళ్ళకేదో ఏర్పాటు చేస్తారు"

గది వుండదు, ఏదో 'ఏర్పాటు' చేస్తారు! ఎన్నో అడగాలనుకున్నట్లు వుందికానీ అడగలేక పోయినారు. వాళ్ళు అడగాలను కున్నవేవో తమకూ అర్థమయింది కానీ చెప్పలేకపోయినారు. ఈ విషయం సున్నితమయింది కనుక, ఇండ్లల్లో పసుల్ను వుంచుకోడం గురించి మాట్లాడినట్లు మాట్లాడలేకపోయినారు.

ఆవిధంగా వాళ్ళొచ్చినారు, పోయినారు. ఇక్కడున్నప్పుడు ఆ రకంగా చర్చలు జరిగినాయి, అంతటితో అయిపోయింది అనుకున్నారు. "కల్లంలో కొట్టం వేసి ఎద్దుల్నీ ఎనుముల్నీ అందులోకి మార్చుదాం" అని మధు ఆరోజు అనేసరికి...... అందరూ అదిరిపడినారు. మధు మాత్రం మామూలుగానే అన్నాడు కానీ, ఆ మాట విన్న వాళ్ళు మామూలుగా వుండలేకపోయినారు. ఏదో అరిష్టం కలిగే పని మధు చెయ్యాలను కుంటున్నట్లు దిగులో, భయమో కలిగింది. మధు ఆలోచన గురించి ఏదన్నా మాట్లాడితే, వాడింకా గట్టిగా తన నిర్ణయాన్ని ప్రకటిస్తాడేమోనని, అది వినడం ఇష్టం లేక......... ఎవరూ మాట్లాడలేదు. రెండురోజుల తర్వాత మధు మళ్ళీ అన్నాడు.

"ఆ సర్కారోళ్ళ జబ్బు నీకూ అంటుకున్నట్టుందే" అన్నాడు పెద్దాయన

"జబ్బులు అంటుకోకుండా వుండడానికే గొడ్లను వేరుగా వుంచుదామనేది"

"ఏం? పసులు ఇంట్లో వుంటే మీ అబ్బకు జబ్బులంటుకున్నాయా? మీ నాయన కంటుకున్నాయా? ఈ వూళ్ళో వాళ్ళకెవరికన్నా అంటుకున్నాయా? లేక ఏ వూళ్ళో వాళ్ళకైనా అంటుకుంటున్నట్లు నీకేమైనా తెలిసిందా?" కోపంగానూ, వెటకారంగానూ అన్నాడు.

"జబ్బులొస్తాయో రావో నాకు తెల్దు. మనుషులూ పశువులూ కలిసి వుండడం అనాగరికం. అట్లా వుండకూడదు."

"ఓహో......... రేపు ముసలోళ్ళతో కల్సివుండడం అనాగరికమని నన్నూ కల్లం దొడ్లోకి తోల్తావన్నమాట"

"మనుషులు ముసలోళ్ళయినా పశువులు కారులే, కల్లం దొడ్లోకి తోలడానికి"

మధు అంత ధైర్యంగా ఎదురుదెబ్బ తీస్తాడనుకోలేదు. పెద్దాయన కూడా ఆశ్చర్య పోయి, వాడి దిక్కు ఎగాదిగా చూసినాడు. అయితే, ఏమంటాడు? తనన్నమాటనే తిప్పి కొట్టినాడు. కొంచెం తగ్గినాడు. "ఒరే అబ్బీ! పసులు కడగా వుంటే చెడిపోతాయి. ఎదురుగా వుంటే వాటిని చూసినట్టు ఎడంగా వుంటే చూడలేం. జీతగాళ్ళ మీద ఇడ్సిపెడ్తే వాళ్ళకేం! ఎద్దు మేత మేసినా మెయ్యకపోయినా కాడి మెడమీదేసి తోలకపోతాడు. ఒక్కమేత సంగతేకాదు. ఏ గొడ్డు ఎట్టాటిదో వ్యవసాయం చేసేవాడికి తెలిసివుండాల. ఒక్కొక్కటి ఒకరకంగా మేతతింటాది, నీళ్ళు తాగుతాది. మన ఉలిపిది బుసలుకొడ్తా, కుమ్ముతా మేత తింటాది. బట్టది శాంతంగా నెమ్మదిగా మేతతింటాది. పన్లో కూడా రెంటికీ ఆ తేడా వుంటాది. ఆ సంగతి నాకు తెల్సు, మీ నాయనకు తెల్సు. నీకు తెల్దు. ఎందుకు తెల్దు? నువ్వు వాటికి మేతేసి నోడివి కాదు, వాటితో వ్యవసాయం సేసినోడివి కాదు. సేతులారా వాటికి మేతా నీళ్ళూ పెట్టివాటితో సేద్యం చేస్తావుంటే ఎట్లావుంటాదో నీకు తెల్దు. పశువును మనిషీ, మనిషిని పశువూ అర్థం చేసుకుంటే అంత వేరు కాదు. సేద్యగాడు సేతనైనోడేనా, తన మీద ప్రేమ వున్నోడేనా అనేది ఎద్దు కనిపెట్తాది. బరె గొడ్డు కూడా తనకు ప్రేమగామేత పెట్టే వాళ్ళకు పాలిస్తాది, లేకపోతే తంతాది."

"కల్లం దొడ్డి దూరంగా లేదు, మన ఎదురుగ్గానే వుంది. కావాలంటే, నువ్వో, మానాయనో వాటికి చేతులారా మేత వెయ్యొచ్చు. నేను సేద్యం చెయ్యకపోబట్టి, నీళ్ళు మేతా వెయ్యకుండా వాట్ని చంపుకుందామనడం లేదు. పశువులక్కూడా సహజ జ్ఞానం వుంటుంది. ఆ జ్ఞానం వేరే, మనుషులకుండే జ్ఞానం వేరే. 'నువ్వు మనిషివా? పశువ్వా?" అని నువ్వే అని వుంటావు. అంటే అర్థమేమిటి? మనిషి వేరే పశువు వేరే, మనిషి పశువు కాకూడదనే. అట్లాంటప్పుడు మనిషీ పశువు ఒకరి పక్క ఒకరుంటూ బతకడమేంది?"

"కుక్కల్ను పక్కన పెట్టుకుని బతుకుతున్న వాళ్ళున్నారు. మన కింత బువ్వపెట్టి, పాలిచ్చే పసుల్ని పక్కన పెట్టుకుంటే తప్పొచ్చిందా?"

"కుక్కల్ను పక్కన పెట్టుకునీ నెత్తినెక్కించుకునీ బతికేవాళ్ళు మనుషులే కానీ, వాళ్ళు వేరే రకం మనుషులు. నేను చెప్పేది మనట్లాంటి మనుషుల గురించే"

"మనట్లాంటి మనుషులున్నట్టే వుండొచ్చుగదా మల్ల... యీ కొత్త పద్ధతెందుకు?"

"కొత్త పద్ధతులెన్నో వచ్చినాయి. కొత్త పద్ధతులను మనుషులు ఇష్టపడకపోతే ఇప్పటికీ ఆకులలములీ, జంతువుల్నీ తింటూ అడవుల్లో వుండాల్సి వచ్చేది"

ఈ రకంగా ఇద్దరికీ వాదాలు నడచినాయి. కొడుకు చేసే పని కూడదని చెప్పలేదని తన మీద కూడా కోపముంది పెద్దాయనకు. ఆయన ముందు అట్లా అనలేదుకానీ మధుతో తనూ మాట్లాడినాడు. కడగా పెడ్తే గొడ్లు చెడిపోతాయనే దాన్ని చాదస్తం కింద కొట్టేసినాడు. ఇండ్లల్లో పెట్టుకున్న వాళ్ళందరూ శ్రద్ధగా చూస్తున్నట్టేనా? అనడిగినాడు. పశువులను వేరుగా వుంచే సర్కారు ప్రాంతంలోనే పశువులు బావుంటాయి, ఇండ్లల్లోనే వుండే మన పశువులు బక్కగా ఎందుకుంటాయి? అనడిగినాడు. మన వైపున వాటిని ఇండ్లల్లోనే వుంచుకోడం ఆలోచన లేని అలవాటుగా వస్తోంది. అంతే తప్ప అబ్బ అంటున్నట్లు మన ఆరోగ్యాన్నీ ప్రాణాలనీ లెక్కచెయ్యని అనుబంధం వాటికీ మనకూ మధ్య వున్నందువల్ల కాదు. ఏ అనుబంధం లేదనీ కాదు, వాటికీ మనకూ మధ్య వుండే అనుబంధం పశువుకూ మనిషికీ మధ్య వుండే అనుబంధం. అంతే. ఇందులో అంత ఆలోచించవలసిందేమీ లేదు. అందరూ వున్నట్లే మనమూ వుందామని అందరం అనుకుంటే ఏ మంచి మార్పూరాదు. ఒకరో ఇద్దరో దాన్ని అమలు చేస్తే, ఆ తర్వాత అవకాశం వున్న వాళ్ళందరూ చేస్తారు. అవకాశం లేని వాళ్ళు కూడా అవకాశం కోసం ప్రయత్నిస్తారు. ఆ ఆలోచనో మార్పో రాకపోతే, అవకాశం వున్న వాళ్ళు కూడా ఉపయోగించుకోకుండా వుంటారు. మనవైపున స్థలమూ, డబ్బూ వున్న వాళ్ళు కూడా ఇండ్లల్లోనే పశువులను వుంచుకోడం అందుకే.'

'

"ఇది మంచి మార్పేనని ఎట్లా చెప్పగలవు?" అనితను అడిగినాడు. "తప్పకుండా మంచి మార్పే. రాత్రీపగలూ పశువుల మధ్య, వాటి రొచ్చూ పేడా వాసనల మధ్య, వాటి ఉచ్ఛ్వాస నిశ్వాసాల మధ్య మనుషులుండడం ఎట్లా వుంటుందో నాకన్నా నీకే ఎక్కువ తెలుసు.

అందువల్ల మా ఆరోగ్యానికే హానీ లేదంటే, అది నిజమా? అంతేగాదు. ఇంట్లో పశువులకు సౌకర్యం వుండి, మనుషులకు లేక పోవడం ఏంది?" ఆతర్వాత తను మాట్లాడలేదు.

"పొద్దాక బీడీలు తాగుతా వుండడమేనా? బీడీల్తో కడుపు నిండుతాదా? బువ్వతినేది లేదా?" భుజం మీద చెయ్యేసి, కదుపుతే అడగిన రామ సుబ్బమ్మ ప్రశ్నతో........ బీడీ తుంటను విసిరేసి కాళ్ళు కిందికి దించి మంచంలో కూర్చున్నాడు రామిరెడ్డి. కాళ్ళకింద మూడు నాలుగు బీడీ తుంటలు తగిల్నాయి, ఆలోచన్లో పడి అదే మొయిన బీడీలు కాల్చినట్టుంది!

"ఏందబ్బా........ అన్ని బీడీలు తాగిచ్చేంత ఆలోచన?" రామిరెడ్డి నవ్వినాడు.

"పొద్దున సంగతే ఆలోచిస్తావుంటి............"

"ఈ ముసిలాయన్ది మరీ మొండిపట్టులేబ్బా. యాన్నో వుంటాండాయా? ఎదురుగ్గానే గదా?" విసుగ్గా వుండేమో, మామూలు కంటే ఎక్కువ దీర్ఘాలు తీసింది. అందరూ 'పెద్దాయన' అంటే, తనొక్కతే 'ముసిలాయన' అంటుంది. అడిగినాడొకసారి.

"నేనూ ముసిలాయన్నే అవుతున్నాను. ఆయనొక్కన్నే అంటావేం?"

"నీకన్నా ముసిలాయన గదా ఆయన. నిన్ను ముసిలాయన అని మధు పెండ్లాం అంటాదిలే"

"అంటే, కోడండ్లకు మామగారి మీద వుండే కోపమన్న మాట"

"ఏమోబ్బా............" అని నవ్వింది.

"పసుల్ను కల్లం దొడ్లోకి మార్సినాక, గాడిపాట్న అంతా గదులు కట్టిస్తాడంట మధు" ఆమె ఆశ్చర్యంగా చూసింది.

"గాడిపాట్న గదులెందుకూ?" అనడిగిందామె. రామిరెడ్డి మాట్లాడలా.

"కాదు......... గదులెందుకంట?" మళ్ళీ అదే ప్రశ్నను, రామిరెడ్డి మోకాలి మీద తడుతూ అడిగింది.

"ఒగ్గది మధుకూ వానిరాబోయే భార్యకేమో, ఇంగోటి ఇంటి కెవరన్నా స్నేహితులొస్తే.........." అని ఒక్కక్షణం ఆగి "ఇంగోటి నీకూ నాకూ అంట" అన్నాడు. ఈ మాట కూడా మామూలుగా చెప్పినట్టుందే కానీ, కొంచెం వణికిన స్వరమూ, ఆమెకు మాత్రమే.......... ఆమె హృదయానికి మాత్రమే చెప్పాలని చెప్పినట్టుండటమూ, అసలా మాటను ప్రత్యేకంగా ఆఖర్న చెప్పడమూ.......... ఆమెకు అర్థమయింది. అర్థమై సిగ్గు పడింది. "ఛీ......' ' అంది. ఆ చీకట్లో ఒకరి ముఖం ఒకరికి సరిగా కనిపించలేదు. ముఖం మీద కనిపించే వాటిని చూడలేకపోయినా లోపలి సంచలనం ఇద్దరికీ తెలుస్తోంది. సర్దుకోవాలనుకున్నట్లు కొంచెం కదిలి కూచున్నారు.

"ఇప్పుడెందుకు మనగ్గది?" అని, పెద్దగారాబోతున్న నిట్టూర్పును అణచుకుని, చిన్నదిగా రానిచ్చింది.

"ఓయమ్మో! ఇది గానీ ముసిలాయనకు తెలిస్తే....... ఇంగా గొడవజెయ్యడూ! పసుల్ని కల్లంలోకి తోలి, మీరంతా గదులు కట్టిచ్చుకొని బయటికి రాకుండా అందులో వుంటారా అని........."

"అదే మధుకు చెప్పినా. పసులకు కల్లంలో ఏర్పాటు చేసినాక, అది అలవాటయితాది. అప్పుడు గదులు కట్టొచ్చు. 'పసులక్కడ చెడిపోతాయనుకుంటే మళ్ళా ఇంట్లోకి మార్చుకుందాం' అని ఆయనకు చెప్పినా. ఇంట్లో గదులు కడ్తామంటే గొడవ ఛేస్తాడు' అని"

"ఏమంటాడు?"

"ఇప్పుడు గొడవచేసినాడు, మళ్ళా అప్పుడు గొడవ! రెండు పనులూ ఒకేసారి చేస్తే, చేసే గొడవంతా ఒకేసారి చేసి వూరుకుంటాడులే' అంటాడు"

"ఊ........ వాడూ మొండోడే" అని, "ఒక పనిచేస్తే సరిపోతాది" అంది. "ఏం పని?" అన్నట్టు చూసినాడు.

'ముసలాయనకూ ఒగ్గది కట్టిచ్చి అందులో పడేస్తే సరిపోతాది" రామిరెడ్డి నవ్వినాడు.

"లేలేపోదాం, బువ్వతిందు" అంటూలేచింది ఆమె. ఆయనా లేచినాడు.

బువ్వతిని చెయ్యి కడుగుతానే పక్క బట్టలు భుజానేసుకుని, బయటికొచ్చి ఇంతకుముందు తనుండిన మంచంలోనే పరుచుకున్నాడు. రాత్రిపూట ఇంట్లో వుండనే లేఢు రామిరెడ్డి. ఇంట్లో వుడక, వూపిరాడనట్టువుంటాది. అన్నీ రాతి మిద్దెలు, గోడలకు కిటికీలుండవు. మిద్దె మీద వెల్తురు రావడం కోసం చిన్నచిన్నగ్గవాసులు (గవాక్షాలు) వుంటాయి. చలికాలం, వానాకాలం ఇండ్లల్లో పండుకుంటే దోమలు పొగమాదిరి చుట్టుకుంటాయి. పొగమాదిరి చుట్టుకునే దోమల్ను తప్పించుకోడానికి, గాట్లోని గడ్డోగాదమో వేసి పొగబెడ్తారు. పొగ బైటికి పోకుండా వుండేందుకు తలుపులూ, పైనగవాసులూ మూసుకుంటారు. ఎట్టావుంటాది? కొక్కులకు వూదరబెట్టినట్టుంటాది. ఈ వుక్కకు తోడు గాడిపాట్న రొచ్చు పేడ వాసన. పసులు బుస పెడ్తావుంటాయి. ఏ రోజుకారోజు గుంతల్లో నుంచీ రొచ్చు ఎత్తి పేడ దిబ్బలో పోసుకోకపోతే, రొచ్చు గాడిపాట్న పార్తావుంటాది. పేడకళ్ళు ఎప్పటికప్పుడు తియ్యకపోతే, పసులు గాడిపాట్న కసాపిసా తొక్కుతూ వుంటాయి. పసులుండే గాడిపాటుకూ, మనుషులు పండుకునే నడవక్కో, జవితికో ఏదీ అడ్డు వుండదూ, ఎక్కువ దూరమూ వుండదు. వుంటే బార బారన్నర దూరముంటాది. దాదాపు ఇండ్లల్లో సగం తావులో మనుషులుంటే, సగం తావుల్లోనో, కొద్ది తక్కువలోనో పసులుంటాయి. ఇంట్లో వుండే మనుషులందరూ ఆ తావులోనే పండుకోవాల. లేకుంటే, వీధుల్లోనో, మిద్దెల మీదనో పండుకోవాల. ఆడోళ్ళూ, పిల్లోళ్ళూ, ముసలోళ్ళూ పండుకోలేరు. ఇదో...... తనట్టాటోళ్ళు ఆ వుక్కకంటే చలైనా వానైనా మేలేనని వీధిలో పండుకుంటారు.

"ఇటువైపు అన్ని వూళ్ళల్లోనూ ఇంతేనా? పశువులను ఇళ్ళలోనే వుంచు కుంటారా?" అని ఆ సర్కారు వాళ్ళు ఎంత ఆశ్చర్యంగా అడిగినారో! వాళ్ళ ఆశ్చర్యం చూసి, 'ఇందులో అంత ఆశ్చర్యం ఏముంది?' అని ఇక్కడి వాళ్ళు ఆశ్చర్య పోయినారు. అంటే, ఇక్కడి వాళ్ళకు ఇదింత మామూలుగా వుంది. "పశువులను ఇళ్ళల్లో వుంచుకుంటారా?" అనడిగితే, "ఇండ్లల్లో వుంచుకోక బయట వుంచుకుంటారా?' అంటారు. ఒకరి ప్రశ్నలో వుండే ఆశ్చర్యానికి, మరొకరి ఆశ్చర్యంతో వుండే జవాబు అదీ, "ఎందుకలా వుంచుకోడం?" అని కూడా అడిగినారు వాళ్ళు. దానికేం జవాబు చెబుతారు? "ఎందుకంటే ఎప్పట్నుంచో ఇక్కడంతే". అవును, ఎప్పట్నించో ఇప్పటివరకూ ఇక్కడంతే. వందల ఎకరాల భూమి వుండిన పెద్ద రైతులూ, ఇంటి పక్కనే జాగాలుండిన వాళ్ళూ కూడా ఇంతే! ఉమ్మడి కుటుంబాలు విడిపోతాయి. విడిపోయిన వాళ్ళలో ఒకరో ఇద్దరో కొత్త ఇళ్ళు కట్టుకొంటారు. ఈ కొత్త ఇళ్ళు కూడా పాత ఇళ్ళమాదిరే పసులూ మనుషులూ కలిసి వుండే పద్ధతిలోనే వుంటాయి. ఒక్కొక్కరికి రెండు ఇళ్ళుంటాయి. ఆ రెండో ఇంట్లో ధాన్యమో, పత్తో, యారముట్లో (వ్యవసాయ పరికరాలు) దాచుకుంటారు. మొదటి ఇంట్లో పసులూ వాళ్ళూ వుంటారు. చదువుకున్న వాళ్ళున్న కుటుంబాలూ, ఉద్యోగాల్లోనో, రాజకీయాల్లోనో వున్న వాళ్ళ కుటుంబాలూ కూడా ఇంతే. వాళ్ళు పట్టణాల్లో వుంటారు, పల్లెల్లో వాళ్ళ వాళ్ళు ఇట్లనే వుంటారు. ఇటువంటి ఇండ్లల్లో పండుకోవడం కష్టమనుకున్న వాళ్ళు డబ్బువుంటే, మేడకట్టుకుంటారు. ఆ మేడలో రాత్రిపూట పండుకోడానికో, పగలు విశ్రాంతి తీసుకోడానికో అవకాశం వుండేది, ఆ ఇంట్లో పెత్తనం వున్నవాళ్ళకే. మిగతావాళ్ళు కింద ఇంట్లో పగలు కాని, రాత్రి కానీ పసుల్తో పాటు వుండాల్సిందే. బరెగొడ్లను మేపుకోడానికి తీసుకపోడమూ, సేద్యానికి పోకుండా వుంటే ఎద్దుల్ని ఏ దొడ్లోనో కొంచెం సేపు కట్టెయ్యడమూ వుంది. అయితే, అట్లాంటివేవీ పసులూ మనుషులూ వేరుగా వుండాలని చేసేవికావు. గాడిపాట్లు ఆరాలని చేసేవే.

"కాపోనికి కండ్లముందరే గొడ్లుండాల" అనే మాట తను తండ్రి నుంచీ విన్నాడు. ఆయన, ఆయన తండ్రి నుంచీ విన్నాడు. అటు తండ్రుల తండ్రుల నుంచీ, ఇటు కొడుకుల కొడుకుల వరకూ ఆ మాట వింటూ వచ్చిందే. కండ్ల ముందరే ఎందుకుండాల అంటే, పెద్దాయన చెప్పినట్లూ.......... దూరంగా వుంటే వాటికి మ్యేతా నీళ్ళూ సరిగా అబ్బుతున్నాయో లేదో తెలీదని, అందువల్ల పసులు చెడిపోతాయనే. ఏ గొడ్డు ఎట్లాంటిదో తెలుసుకోడానికి క్యూడా ఎదురుగా వుండాలంటాడు ఆయన. ఇండ్లల్లో పసులను పెట్టుకునే వాళ్ళందరూ యీ రెండిటి కోసమూ పెట్టుకుంటున్నారని చెప్పలేం. పెద్దవాళ్ళ నుంచీ వస్తున్న పద్ధతి కనుక పెట్టుకుంటున్నారనిపిస్తుంది. మధు అన్నట్లూ, పసుల్ని ఇంట్లో పెట్టుకుంటున్న వాళ్ళందరూ వాటిని శ్రద్ధగా చూస్తున్నట్టుకాదు. ఇప్పటోళ్ళు వాట్ని పట్టించు కోడమేలేదు. అప్పటోళ్ళలో కూడా ఆ పని ఆడోళ్ళమీద వేసిన వాళ్ళు ఎందరో వున్నారు. పేడకళ్ళూ, రొచ్చు ఎత్తి గాడిపాటుతోసే

పని కూడా ఆడోళ్ళ మీద వేసిన వాళ్ళూ వున్నారు. "చేతులారా మేతా నీళ్ళూపెట్టి, ఆ ఎద్దుల్తో సేద్యం చేస్తావుంటే ఎంత బావుంటాదో!" అని తను కూడా అనుకుంటాడు. నిజానికి, ట్రాక్టర్‌తో సేద్యం చేయడం కంటే ఎద్దుల్తో సేద్యం చేయడమే ఇప్పటికీ నచ్చుతాది. అయితే, వాటికి మేతా నీళ్లూపెట్టి సేద్యం చెయ్యడానికీ, వాటిని ఇంట్లోనే పెట్టుకోడానికీ సంబంధం లేదు. శ్రద్ధగా చూడని వాళ్లు ఇంట్లో వున్నా చూడరు, చూసే వాళ్ళు బయటున్నా చూస్తారు.

"రాత్రీ పగలూ పశువుల మధ్య, వాటి పేడా రొచ్చు వాసనల మధ్య, వాటి ఉచ్ఛ్వాస నిశ్వాసాల మధ్య మనుషులుండటం ఎట్లా వుంటుందో నాకన్నానీకే ఎక్కువ తెలుసు. అందువల్ల ఆరోగ్యానికి హాని లేదంటే నిజమా? ఇంట్లో పశువులకు సౌకర్యం వుండి, మనుషులకు లేకపోవడం ఏంది?" అవును. ఎందుకు తెలీదు? తనకేకాదు. ఇక్కడి, వాళ్ళందరికీ తెలుసు. "ఇంట్లో పశువులకు సౌకర్యం వుండి మనుషులకు లేకపోవడం ఏంది?" నిజానికి పసులక్కూడా సౌకర్యం వున్నట్లుకాదు. గాలీ, వెల్తురు లేని గాడిపాట్లు అవి కూడా మగ్గిపోతూ వుంటాయి. బయటికి రావడానికి తొక్కులాడుతుంటాయి. మనుషుల సంగతి చెప్పనక్కర్లేదు. అంటే, ఇటు మనుషులకూ సౌకర్యం లేదు, అటు పసులకూ సౌకర్యంగా లేదు. అయినా అట్లాగే వుంటున్నారు. "మన ఆరోగ్యం కన్నా, ప్రాణాల కన్నా పసులు ముఖ్యం మనకు" అంటాడు పెద్దాయన. "కరువొచ్చి, మనుషులకు తిండీ, పసులకు మేతాలేనప్పుడు పసులను కోతకిచ్చి, మన ప్రాణాలను నిలబెట్టుకోవాలనుకున్నాం" అన్నాడు మధు. "అది మన ప్రాణాలను నిలబెట్టుకోవాలని చేసింది కాదు. మన కండ్ల ముందు అవి చావడం చూల్లేక చేసే పని" అన్నాడు తను. "సరే, అట్లనే అనుకున్నా మన ప్రాణాల కన్నా ఎక్కువ కాదని తేలింది కదా" మధు చెప్పేది కటువుగా వున్నా, నిజమేనని ఒప్పుకోవాలేమో! మనుషుల ఆరోగ్యం కన్నా ఎక్కువ అనిగాక, ఆ విషయం ఆలోచించక పోవడం వల్లనే పశువులను ఇండ్లల్లో వుంచుకుంటున్నామేమో!

రామిరెడ్డి ఏదో అసౌకర్యంగా వున్నట్లు లేచి కూచున్నాడు. ఎదురుగ్గా చంద్రుడు, పెద్దరుగు మీదుండే రావిచెట్టుకూ, వెంగల్రెడ్డిగారింటి ముందుండే వేప చెట్టుకూ మధ్య కనిపిస్తున్నాడు. వెన్నెలకు చుక్కలు అక్కడొకటీ ఇక్కడొకటీ పల్చగా కనిపిస్తున్నాయి. పడమటి వీధిన ఎవరో కొట్లాడుకుంటున్నట్లు ఆడోళ్ళూ మొగోళ్ళూ అరుచుకుంటున్నారు. ఒక ఆడ గొంతు కీచుగా కేకలు పెడుతూ, శాపనార్థాలు పెడుతోంది. పొట్టి గంగిరెడ్డి గారింట్లో, తెల్లార్జామున్నే సేద్యానికి పోవాలనేమో ఎద్దులకు పత్తిగింజలు కొడుతున్నారు. నలుగురు కొడుతున్నారు. నాలుగు గూటాల చప్పుడు లయగా వినిపిస్తోంది. పక్కనే వున్న కల్లంకాడి నారాయణ గారింట్లో మూడురోకండ్లతో జొన్నలు దంచుతోన్న శబ్దం వినిపిస్తోంది, పొద్దన కూలోళ్ళ సంగటికేమో! మాది గిండ్లల్లో పిల్లోళ్ళు పలకల మీద (తప్పెటల మీద) మూడో అడుగువాయిస్తున్నారు. కొంచెం సేపు విని...... "పిల్లనాయాండ్లు! తప్పుగా కొడ్తున్నారు"

అనుకున్నాడు. రావి చెట్టు చిటారు కొమ్మల్లో రెండు కొంగలు వెన్నెల్లో తెల్లగా కనిపిస్తున్నాయి. వేప చెట్టు మీద ఏదో పిట్ట బెదిరినట్టుగా 'కీర్..... కీరో' అని అరిచింది.

"కొత్తగా పెళ్ళయిన వాళ్ళకు్కూడా గదులుండవా?" అనడగడమూ, "వుండవు" అంటే, వాళ్ళు నోర్లు తెరుచుకోడమూ.......... తల్చుకుంటే ఇప్పటికీ నవ్వొస్తాది. "గదులుండవు, ఏదో ఏర్పాటు చేస్తారు" అట్టాటి 'ఏర్పాటు' తనకూ చేసినారు. "ఇప్పుడెందుకు మనగ్గది" అనడిగిందామె. ఆమెకూ ఆ 'ఏర్పాటు' సంగతీ, అవతల జరిగిన ఎన్నో సంగతులూ జ్ఞాపకం వచ్చి వుండాల, జ్ఞాపకం వచ్చివుంటేనే, అవసరం వున్నప్పుడంతా లేకపోయినాక "ఇప్పుడెందుకు మనగ్గది?" అని వుండాల. ముందు, "మధు మనిద్దరికీ గది కట్టిస్తాడంట" అన్నప్పుడు "ఛీ" అంది. ఆ తర్వాత, "ఇప్పుడెందుకు?" అంది. తనూ, తనకంటే ముందటి వాళ్ళూ తరతరాలుగా అనుభవిస్తూ, చూస్తూ వచ్చిన జీవితం ముందు కనిపించింది. భార్యా భర్తలకు విడిగా గది అవసరం అనేదాన్ని ఊహించడానిక్కూడా సిగ్గుపడిన జీవితం అది. అందుకే "ఛీ" అంది.

తనూ, తన భార్యా మొదటిసారిగా కలసిన అనుభవం ఎప్పటికీ జ్ఞాపకం వుంటుంది. మధురమైన అనుభవంగాకాదు, ఎప్పుడు జ్ఞాపకం వచ్చినా, వాళ్ళ మీద వాళ్ళే జాలిపడే అనుభవంగా! పెద్దలు, తమిద్దరి దాంపత్య జీవితాన్ని ప్రారంభించమని అనుమతి ఇచ్చింది...... ఒక చీకటి కొట్లో. దాన్ని 'ఆయపిండ్లు' అంటారు. అటువంటిది అన్ని ఇండ్లలోనూ వుంటుంది. అందులో కొద్దిపాటి ధాన్యమూ, మిరపకాయలూ, చింతపండూ వంటివి దాచుకున్న గాదెలూ, వాడలూ వుంటాయి. పలుగూ, పారవంటివీ వుంటాయి. అందులోనే బట్టలు వేసుకునే దణ్ణెం వుంటుంది. ఇంకా ట్రంకు పెట్టెలూ, వుంటే బోషాణాలూ వుంటాయి. మామూలుగానే కిటికీలుండవు. మామూలుగానే పైన చిన్న 'గవాసి' వుంటే వుంటుంది. ఆ గదిని అప్పుడప్పుడూ కడగటానిక్కానీ, బూజుదులపడానిక్కానీ అవకాశం వుండదు. ఎలకలూ, పందికొక్కులూ చేరే అవకాశం వుంటుంది. ఎప్పుడైనా పాములూ కనిపించవచ్చు. తేళ్ళయితే తప్పకుండా వుంటాయి. పగటి పూట కూడా దీపం వెలిగించుకొని పోకపోతే, అందులో ఏముండేదీ కనిపించదు.

అటువంటి గదిలో కొత్తగా పెళ్ళయిన వాళ్ళకు ఏర్పాటు చేస్తారు. ఆ ఏర్పాటులో కొత్త దంపతులు సుఖించాల! సామాన్ల మధ్య మంచం పట్టేంత స్థలమో, మంచం కాక చుట్టూ ఒక మూరెడు స్థలమో వుంటుంది. ఆ గదిలోకి వస్తూనే తుమ్మకుండా దగ్గకుండా వుండడం ఎవరికైనా సాధ్యం కాదు. ఇద్దరూ కొత్తవాళ్ళు కనుక, తుమ్మడానికీ దగ్గడానికీ కూడా బిడియం. వాటిని బిగబట్టుకోవడమూ కష్టమే. ఈ అవస్థ మగవాడి కంటే ఎక్కువగా ఆడవాళ్ళకుండొచ్చు. దీపం ఆర్పకపోతే సిగ్గు.......... ఆర్పితే ఏ ఎలుకలు పాకుతాయో, తేళ్ళుకుడతాయో అన్న భయం. ఈ భయాలకూ, సంకోచాలకూ వళ్ళంతా చెమటల్లు పడ్తాయి. దానికి తోడు గదిలో 'మామూలు ఉక్క' వుండనే వుంటుంది. ఇది తమ అనుభవమే కాదు, ఇక్కడి వాళ్ళ ఎంతో మంది అనుభవం. ఈ అనుభవం తెలీనివాళ్ళకు, ఇది భయంకరమైన శిక్షగా, నమ్మలేనట్టుగా కనిపిస్తాదేమోకానీ,

ఇక్కడివాళ్ళకు మామూలుగానే కనిపిస్తాది. అంటే, వీళ్ళు ఇబ్బంది పడలేదని కాదు. ఆ ఇబ్బంది కానీ ఇతర ఇబ్బందులు కానీ అన్నీ మామూలుగానే కనిపిస్తాయి.

'ఆయపిండ్లు' (సామాన్లగది) లేని వాళ్ళో, లేక, వున్నా అందులో ఏమాత్రం స్థలం లేని వాళ్ళో అయితే ఇంకోరకం 'ఏర్పాటు' చేస్తారు. వాళ్ళు ఇంట్లో ఏదో ఒక మూలన ఇద్దర్నీ వదిలేస్తారు. చాలా ఇండ్లల్లో ఆ 'మూల' శోభనం గదిగానూ, కాన్పుల గదిగానూ ఉపయోగపడుతూ వుంటుంది. 'ఆయపిండ్లు' అయితే, ఎలుకల భయమూ, తేళ్ళ భయమూ తప్ప ఎవరన్నా వస్తారేమోనన్న భయం వుండదు కానీ, మూలన చేరిన కొత్త దంపతులకు ఒక మూల అటువంటి భయం వుంటుంది. వాళ్ళకు అటువంటి భయం లేకుండా చేసేందుకు ఇంట్లో వాళ్ళంతా ఒక పథకం అమలు చేస్తారు. ఇంట్లో వుండే పిల్లాజెల్లా. ఆడామొగా అంతా వీధిలోనో, అరుగుల మీదనో, మిద్దెమీదనో పండుకొని.......... వాళ్ళక్కొంచెం స్వేచ్ఛనిస్తారు. అయితే, ఇంట్లో అందరూ ఇట్లా పక్షుల మాదిరి ఎగిరిపోయి (అందులో కొన్ని రెక్కలు రాని పక్షులు కూడా వుంటాయి). ఏ చెట్ల మీదనో ఉడిగి, తెల్లవారుజామున్నో, తెల్లవారాకనో వస్తూ వుండడం అనేది ఇబ్బందిగా వుంటుంది. ఇంట్లో అందర్నీ బయటికి పంపేసి, ఇద్దరే ఇంట్లో వుండడం అనేది ఒక రకంగా బహిరంగంగా వున్నట్టే అనిపించి, ఆ కొత్త దంపతులకూ సిగ్గుగా వుంటుంది. దాన్తో, తొందరలోనే పాతదంపతులైపోతారు. అంతటితో ఆ తతంగం ముగిసి, సాధారణ పరిస్థితి ఏర్పడుతుంది.

అయితే, ఎన్ని భయాల్లో, ఎంత హింసలో భార్యాభర్తలు తొలిసారి కలుసుకున్నా....... దాని ఆకర్షణ దాని కుండనే వుంటుంది. అప్పుడు ఆ విరక్తిలో "ఈ సుఖం లేకపోతే పీడాపోయింది. ఈ ప్రత్యేక శిక్షలేకుండా అందరి మాదిరే వుంటే బావుంటుంది" అనిపిస్తుంది. ఆ తర్వాత శిక్ష సంగతి పూర్తిగా కాకపోయినా కొంతమరుపున పడుతుందేమో! మళ్ళీ అటువంటి అవకాశం కావాలనిపిస్తుంది. అయితే, ఆ అవకాశం మళ్ళీ ఎట్లా దొరుకుతుంది? ఇక్కడి జీవితంలో ఏ భార్యాభర్తలకైనా ఒకే ఒక్కసారి (కొద్దిరోజులు) దొరికే అవకాశం అది. బహుశా, అందువల్లనే అప్పుడు పడిన హింసను మరచిపోతారేమో! తమకిద్దరికీ పెండ్లయిందనీ, పెండ్లయినాక తామిద్దరూ భార్యాభర్తలయ్యారనీ, భార్యాభర్తలు కలుసుకున్నా, కలిసి మాట్లాడుకున్నా తప్పులేదనీ ఆ ఇద్దరికీ తెలుసు. అందరికీ తెలుసు. అయితే, ఆ అవకాశమే వుండదు. "అత్తా మామా చూసినా, ఆడబిడ్డలు చూసినా, తోడికోడళ్ళూ మరదులూ చూసినా ఏమనుకుంటారు?" అని ఆమెభయపడితే, అతనూ అట్లనే భయపడ్డాడు. బహుశా ఎవరికీ అటువంటి అవకాశం లేకపోవడంతో, అంతాకలసి కొత్తదంపతుల క్కూడా లేకుండా చేయాలనుకుంటారేమో......... అనిపిస్తుంది. "ఏం? కొత్తప్పుడు మేం బాధపల్లేదా? కొత్తప్పుడే కాదు, పాతప్పుడూ బాధపడుతున్నాం కదా! మీరెందుకు సుఖపడాల?" అనుకున్నట్లుగా వుంటుంది.

ఏ కొత్తదంపతులన్నా తరుచుగా మాట్లాడుకుంటున్నట్టు కనిపిస్తే, "ఎప్పుడూ మొగున్తో గుసగుస లాడ్తానేవుంటాది" అని ఆ పిల్లను గురించీ, "పెండ్లాం కొంగు పట్టుకుని తిరుగుతావుంటాడు" అని వాన్ని గురించీ అంటారు. మరి, అంతకుముందు అందరూ కలిసి వాళ్ళిద్దరికీ అవకాశం ఇచ్చినారు కదా! అవును, ఇచ్చినారు. పెండ్లయినాక ఇద్దర్నీ 'ఒక్కటి' చెయ్యాలగదా! దానికి 'హద్దు' వుంది. అద్దే 'మూడు రాత్రులు', 'మూడు రాత్రులు గడపడం' అంటారు. అంతటితో సరిపాయె. ఎప్పటికీ అట్లనే గడుపుతామంటే ఎట్లా? తప్పనిసరిగా, 'ఒక్కటి' అయిన వాళ్ళు మళ్ళా 'రెండు' కావలసిందే! ఒకసంగతి ఇప్పటికీ జ్ఞాపకముంది. తన తమ్ముడు 'సిన్నోడు' (జయరామిరెడ్డి) పెండ్లయిన కొత్తలో పెండ్లాంతో పగలు మాట్లాడుతూ వుంటాడని, ఈ పెద్దాయనే ఏమన్నాడు? "పనీ పాటా లేకుండా ఎప్పుడూ ఆడోళ్ళతో మాట్లేందిరా ఆడతంగినాకొడక్కా! అవతలా ఇవతలా మొగోళ్ళందరూ నీ మాదిరే వుండారా?" అని తిట్టినాడు. దాన్తో వాడు అవతలా ఇవతలా వుండే మొగోళ్ళ మాదిరే అయిపోయినాడు.

భార్యాభర్తలు కోరుకున్నప్పుడు శారీరకంగానైనా కలుసుకోగలిగిన అవకాశం వుండి వుంటే, వాళ్ళిద్దరూ వూరికే మాట్లాడుకున్నా, 'అందుకే' ననుకుని, ఈర్ష్యపడే పరిస్థితి లేకుండా వుండేది. అట్లనే, భార్యాభర్తలు కలుసుకోవాలన్నా 'దొంగతనం'గా 'అక్రమసంబంధం' మాదిరి కలుసుకోవలసిన పరిస్థితీ వుండేదికాదు. స్వేచ్ఛగా మాట్లాడుకోగలిగిన అవకాశం లేదు కనుక, ఏదోరకంగా దొరికే అవకాశాన్ని 'అందుకే' ఉపయోగించుకోవాలని వాళ్ళు అనుకోడం సహజమే. "ఏదోరకంగా దొరికే అవకాశం" అంటే, అవకాశం ఏదోరకంగా అదే దొరుకుతుందనికాదు. అట్లా దొరికేవి చాలా తక్కువగా వుంటాయి. అవకాశాన్ని ఏదోరకంగా దొరికించుకోవలసినవే ఎక్కువగా వుంటాయి. అట్లా అవకాశాన్ని దొరికించుకునేందుకు పడిన యాతన తల్చుకుంటే, ఇప్పటికీ నవ్వువస్తుంది, జాలీ కలుగుతుంది. తనూ, తన భార్యా 'ఒక్కటై' మళ్ళీ 'రెండు' అయినాక, ఆ రెండు ఒక దాన్నొకటి దూరం నుంచీ చూసుకునేవి. అట్లా చూసుకుంటూ, చూసుకుంటూ వుంటే......... వాటికి అట్లా దూరంగా కాక దగ్గరగా వుండాలనిపించింది, ఎప్పటికీ కాదు, ఎప్పుడో ఒక్కసారన్నా! అందుకొక మార్గం తట్టింది. తట్టిందంటే, ఇక్కడెవరికీ తెలియన్దికాదు, అందరికీ తెలిసిందే.

ఆ రోజు పలానాసేనికి సేద్యానికి పోతున్నట్లు చెప్పి, 'తన'(1)తో బువ్వ పంపించమని అమ్మకు చెప్పినాడు. సేనికి ఏ దావన (దారిన) రావాల్లో 'తన'కు చెప్పినాడు. అప్పటికీ తనకు దావ తెలీదే అని........ 'తను' అంటే, "దావన ఎదురుపన్నవాళ్ళను అడుగుతా రా" అని చెప్పినాడు. అంతగా తననే ఎందుకు బువ్వతెమ్మంటున్నాడో 'తన'కూ అర్థమైనట్టుంది. "సరే" నంది సరదాగా. సరదాగానే బువ్వబుట్టి (చిన్న గంప) తీసుకుని సేనికి బయల్దేరింది. దావలో ఎవరెవరో

---

1. భార్యను గురించి భర్త, భర్తను గురించి భార్య ఇతరులతో చెప్పేటప్పుడు "తను" అని సంకేతించడం రాయలసీమ సంప్రదాయం

ఎదురుపడినారు. ఇద్దరు ముగ్గురు "ఎక్కడికమ్మా" అనడిగి, ఎట్లపోవాలో చెప్పినారు. గడ్డిమోపుతో ఎదురైన నాగమ్మమాత్రం "ఎక్కడికి?" అని అడిగినాక, ఎక్కడికో చెబితే, "ఓహో!" అని నవ్విందంట. నవ్వి, "పో... పో! బిరీనపో! ఆకలితో నీకోసమే సూస్తా వుంటాడు రామిరెడ్డి పాపం!' ' అని ఇంకా గట్టిగా నవ్వి, పోయిందంట. ఇదంతా 'తను' చెబుతూంటే, తను వింటూ........... ఇద్దరూ బువ్వతిన్నారు. బువ్వ తిన్నాక బుట్టి తీసుకుని "పోతా" అంది. "పోదూలే......." అని బుట్టి పక్కన పడేసి, దగ్గరికి తీసుకున్నాడు. "ఆకలి తీర్లేదా?" అని నవ్వింది. వున్నట్టుండి, ఒక్కసారిగా విడిపించుకుని దూరంగా జరిగింది. "ఏం?" అంటే, "ఎద్దులు చూస్తాండాయి" అని వాటి దిక్కు చూపింది. ఎద్దులు రెండూ సగం కండ్లు మూసుకుని, నెమరేస్తూ నిలబడున్నాయి.

తమకంటే మధు ఒక్కడే కొడుకు కానీ, తను ముగ్గురు అన్న తమ్ముళ్ళూ, నలుగురు అక్కచెల్లెళ్ళ మధ్యన పుట్టినోడు. ఇద్దరు అక్కగారూ ఇద్దరు చెల్లెళ్ళయితే, మగ వాళ్ళలో తనే పెద్దవాడు. మధుకు పద్నాలుగేండ్లు వచ్చేదాకా అందరూ కలిసే వుండినారు. ఆడపిల్లలకు పెండ్లిండ్లయి అత్తవారింటికి పోయినా, ఎప్పుడూ ఎవరో ఒకరు కాన్పుకని పుట్టింటికి వచ్చి వుండేవాళ్ళు. ఒక్కోసారి ఇద్దరుండేవాళ్ళు! తమ్ముండ్లూ, వాళ్ళ భార్యలూ, పిల్లలూ, పుట్టింటికొచ్చిన ఆడపిల్లలూ, వాళ్ళను చూడడానికి వచ్చే వాళ్ళ భర్తలూ, వాళ్ళ పిల్లలూ.......... అందరూ ఒకే ఇంట్లో వుండేవాళ్ళు. పెద్దవాళ్ళు, అంటే అమ్మానాయినా కూడా వుండేవారు. ఇంతమంది ఒకే ఇంట్లో ఎట్లా వుండేవాళ్ళు? ఎక్కడెక్కడ పండుకునే వాళ్ళు? ఇంట్లో సగం పశువులకు సరిపాయె, ఎవరికీ గదులూ లేకపాయె! నువు జెప్పినట్టూ భార్యాభర్తా కల్సుకోడానికి పొలాల్లోకి పోవాల్సివస్తే, ఇంట్లో పండుకోడానికే స్థలం లేకపోతే........ ఎట్లా కాపురాలు చేసినారు? ఎట్లా పిల్లలు పుట్టినారు? అని ఎవరన్నా అడిగితే............ "ఎట్లనో చేసినారు, ఎట్లనో పుట్టినారు" అని ఒక చిన్న మాట చెప్పవలసిందే. అంతకుమించి చెప్పేందుకులేదు. అంతేగదా!

ఎంగటమ్మ జ్ఞాపకం వచ్చినప్పుడల్లా ఎంత బాధ కలుగుతాదో! ఆయమ్మిదేం తప్పు? ఏ తప్పూ చేయకుండానే, తప్పు చేసినట్టు బతికినంత కాలమూ ఎంత అవమానపడింది! ఆ సంగతి ఆయమ్మికీ తనకూ తప్ప ఇంగెవరికీ తెలీకపోయినా, ఆ తర్వాత ఎన్నడూ తన ఎదుట పడలేదు పాపం. ఎంగటమ్మ తన పెద్ద తమ్ముడు శివరామిరెడ్డి భార్య. అప్పుడు చలికాలం. అందరూ ఇంట్లోనే పండుకొన్నారు. దీపమార్పితే కన్ను పొడుచుకున్నా కనపడని చీకటి! ఎవరెవరు ఎక్కడుండారో వాళ్ళవాళ్ళ తావుల్ని (స్థలాలను) బట్టి అందాసుగా తెలుసుకోవలసిందే. అట్లాంటి చీకట్లో పొరపాటు పడకుండా కావలసిన వాళ్ళ దగ్గరికి పోవడం కష్టమే. అయితే, ఆ చీకటి వల్లనే వాళ్ళకు ఆ అవకాశమైనా దక్కేది. ఎంగటమ్మ ఎట్లా పొరపాటు పడిందో! తన మంచం కాడికొచ్చి తనను 'జరుగు' అన్నట్లు చేత్తోతోసింది. నిద్రబోతున్నందుకు కోపమొచ్చినట్టు తొడమీద

గిచ్చింది. తను ఉలికిపడిమేలుకున్నాడు. అరవకుండా అరచేత నోరుమూసింది. ఎవరు? ఎవరైనా తన తమ్ముండ్ల భార్యల్లో ఒకరు (అప్పుడు తన భార్య పుట్టింటికి పోయింది). బలవంతంగా ఆమె చేయి పక్కకు తీసి "నేను మీ బావను" అన్నాడు. అంతే! ఒక్క ఉదుటున మంచం మీది నుంచీ లేచింది. మల్లెప్పుడూ తనకెదురుగా రాలేక పోయింది. నిజానికి, ఆ రాత్రి తనకాడికి వచ్చింది. ఆ యమ్మి అని తన ఎదుటికి రాకపోవడం వల్లనే తెలిసింది. తనను బరితెగించిన దానిగా బావ అనుకొని వుంటాడనే ఆయమ్మి బాధపడింది. చీకట్లో జరిగిన పొరపాటుకు వెల్తురులో కూడా మొగమెత్తలేకపోయింది! ఆ యమ్మి బరితెగించిందా? అంత సున్నితమైన మనస్సున్న మనిషి బరితెగించిందా? అటువంటి మనిషి ఆ విధంగా బాధపడవలసి రావడానికార్కణం, తమ బతుకే కదా?

భార్యను భర్తో, భర్తను భార్యో కావాలనుకున్నప్పుడు కలుసుకునే అవకాశమే వుంటే, తను అంత 'పిచ్చి పిల్ల'ను పొలాల్లోకి రమ్మనే అవసరం వుండేదికాదు. ఎంగటమ్మ అంతగా సిగ్గుపడే అవసరం వుండేదికాదు. శారీరకంగా కలుసుకోడానికే కాదు, మంచీ చెడ్డా మాట్లాడుకోడానికో, కాదంటే పోట్లాడుకోడానికో దేనికీ అవకాశం లేక పోతే ఎట్లా? "పసుల్తో కల్సి వున్నందువల్ల మా ఆరోగ్యానికేమయింది? మా పెద్దోళ్ళు డెబ్బయి ఎనబై ఏళ్ళు బతకలేదా?' ' అన్నట్టే.......... "గదుల్లేక పోతే ఏమయింది? మేం సంసారాలు సెయ్యలేదా? మాకు ప్రేమల్లేవా? మేం పదిమంది పిల్లల్ని కన్నాం" అనొచ్చు. అవును, సంసారాలు చేసినారు. భార్యా భర్తలు వ్యభిచారం చేస్తున్నట్లు కలుసుకున్నా......... వాళ్ళకు పిల్లలు పుట్టినారు. అయితే, పదిమంది పిల్లల్ని కన్నవాళ్ళు ఎన్నిసార్లు స్వేచ్ఛగా మాట్లాడుకొని వుంటారు? మాట్లాడుకునేందుకే వీల్లేకపోతే "మాకు ప్రేమల్లేవా?" అంటే అర్థముందా? మనిషికి మనిషి అర్థం గాకపోతే, వాళ్ళకు పిల్లలు పుట్టొచ్చు కానీ ప్రేమ ఎట్లా పుడుతుంది? "ఇప్పుడెందుకు మనగ్గది?" అన్నదంటే, అందులో ఎంత బరువు మోసిన అనుభవం వుండాలి!

కొయ్య మీదున్న నెమలి (కోడిపుంజు) రెక్కలు తపతపకొట్టి కూతెయ్యడంతో, రామిరెడ్డి ఆలోచన తెగిపోయింది. "అరె.....! అప్పుడే కోళ్ళు కూసేయాళయిందా? ఎన్నెలకు యాళ తెలీక కూస్తావుండాయా?" అనుకున్నాడు. పైకి చూస్తే, 'గొరకోళ్ళు' నెత్తి మీద, కొచ్చినాయి. చెంగల్రెడ్డి గారింట్లో ఎద్దులకు మేతేసి, లేవడానికి 'రిక్క' కొడుతున్న శబ్దం వినిపిస్తోంది. వూళ్ళో వున్న కోడిపుంజులన్నీ వరుసగా కూతలందుకున్నాయి. చలిగాలి వీస్తోంటే, తలాపున వుంచిన దుప్పటి తీసి కప్పుకొని పండుకొన్నాడు. రామిరెడ్డి. "శివరాత్రి ముందు పగలేమో ఎండ కాస్తాది. తెల్లర్జామున సలిగా వుంటాది" అనుకున్నాడు. "ఇంతసేపు మేలుకున్నానేంది? ఇంగనన్నా నిద్రబోవాల" అనుకున్నాడు.

"నిద్రబోవాల" అనుకున్నాడు కానీ నిద్రరాలేదు. ఇంత సేపు సాగిన ఆలోచన ఒక సందేహాన్ని ఎత్తి చూపుతోంది. "డబ్బూ, జాగా వుండేవాళ్ళు కూడా పసుల్ను ఇంట్లో పెట్టుకోనుండేది ఎందుకు? అయిమన్లోభాగం" అంటాడు పెద్దాయన. "పసులను ఇంట్లో వుంచుకోకూడదనే ఆలోచనరాక" అంటాడు మధు. ఆ సర్కారోళ్ళూ అట్లనే అన్నారు. అయితే, ఆ ఆలోచన ఎందుకని రాలేదు? సర్కారోళ్ళకు వచ్చిన ఆలోచన, రాయలసీమ వాళ్ళకు ఎందుకు రాలేదు? ఆలోచన రావడానికి కారణమున్నట్టే రాకపోడానికీ వుండాల గదా! వూరికే "ఆలోచన రాలేదు" అంటే, సరైనదెట్టా అవుతుంది? అది సరికానట్లే "మేం తెలివి తక్కువోళ్ళం కాబట్టి ఆలోచన రాలేదా?" అనడగడమూ సరైనదికాదు. అంటే, ఆలోచనరాకపోవడానికి తెలివితక్కువ తనం కాక, ఇంకేదో కారణముండాల.

ఇంత రాత్రయినా నిద్రరాలేదే అన్న చింత దీన్తో ఎగిరిపోయింది రామిరెడ్డికి. ఉత్సాహంగా మళ్ళీ ఆలోచనలోకి దిగిపోయినాడు. వ్యవసాయం చేసే వాళ్ళకు ఇంట్లో నలుగురుంటే, నలుగురూ నాలుగు పనులు చెయ్యడానికి అనువుగా వుంటాది. వ్యవసాయ సమాజంలో, వ్యవసాయంలో ఈడు పడకుండా ఎప్పటికప్పుడు ముందుండే వాళ్ళకుండే గౌరవం, వెనుకబడిపోయే వాళ్ళకుండదు. తాము నలుగురు అన్నదమ్ములుండడం వల్ల వ్యవసాయం బాగా చేసేవాళ్ళు వూళ్ళో పెత్తనం చెలాయించేందుకూ, సన్నుజనాన్ని తమ అదుపులో వుంచుకునేందుకూ ఉమ్మడి కుటుంబం ఉపయోగపడుతుంది. తమ తండ్రి శివారెడ్డి చుట్టుపక్క వూళ్ళలో పెద్దరైతుగా, పెద్ద మనిషిగా పేరు తెచ్చుకున్నాడు. ఉమ్మడి కుటుంబంలో వుండే ప్రయోజనాలూ వున్నాయి. అయితే, వ్యక్తులు నలిగిపోతూ వుంటారు. అందువల్లనే, 'కలసివుంటే కలదు సుఖం' అని ఎంత చెప్పినా, ఉమ్మడి కుటుంబాలు విడిపోతుంటాయి.

అదట్టా వుండనిస్తే, ఇంట్లో ముగ్గురు నలుగురు అన్నదమ్ములూ వారి భార్యలూ వున్నప్పుడు అందరికీ గదులు కట్టుకోలేరు. పైగా గదులు కట్టుకుని ఎవరంతటవాళ్ళు వుండడం అనేది ఉమ్మడి కుటుంబ పద్ధతికి వ్యతిరేకం. అందువల్ల, కొంతవరకూ దొరికిన స్వేచ్ఛను పూర్తి స్వేచ్ఛగా మార్చుకునేందుకు, అంటే విడిపోయేందుకు ప్రయత్నిస్తారేమో అన్నభయం. వ్యక్తుల సౌకార్యాలు చూస్తే, ఉమ్మడి కుటుంబం వుండదేమోనని భయపడితే, వ్యక్తుల సౌకర్యాలు చూడకపోవడం వల్ల ఉమ్మడి కుటుంబం చీలికలయింది. "కాపోని కండ్లముందరే పసులుండాల" అనే పెద్దాయనే, "ఆడోళ్ళతో మాట్లేంది?" అన్నాడు. ఒక వైపు వ్యక్తుల సౌకర్యాలను అడ్డుకుంటూ, మరొకవైపు ఉమ్మడి కుటుంబాన్ని కాపాడుకోడం అది. వ్యవసాయ సమాజంలో భాగమైన ఉమ్మడి కుటుంబంలో పశువులూ భాగం. "పశువులు మాల్లో భాగ్గమే' ' అన్నది అందుకే. అందుకే ఎన్నో ఏండ్ల నుంచీ ఇక్కడ వాటితో మనుషులు కలిసి వుండేది. వాటిని కడగా పెట్టాలన్న ఆలోచనే రాన్ది. అయితే, ఇది కూడా ఆలోచించి చేస్తున్నది కాదు.

పశువులను విడిగా పెట్టాలన్న ఆలోచన రానట్టే, కూడా వుండాలన్న ఆలోచన కూడా ప్రత్యేకంగా లేదు. కూడా వుంటున్నారు, అంతే. అంటే, ఇక్కడి జీవనవిధానంలో కలిసిపోయింది. ఉమ్మడి కుటుంబం చెదిరిపోయినా, ఆ లక్షణాలు మిగిలివున్నాయి. వాటిని కాపాడవలసిన బాధ్యత ఉమ్మడి కుటుంబానికి ప్రతినిధులైన వాళ్ళ మీద వుంది. పెద్దాయన పసులను కడగా వుంచడానికి ఒప్పుకోనిది అందువల్లనే. ఇంట్లో గదులు కట్టడాన్ని కూడా తప్పక వ్యతిరేకిస్తాడు. ఉమ్మడి కుటుంబం అంతరించిన దశకు మధు ప్రతినిధి. తను? ఆ దశకూ, ఈ దశకూ చెందిన మనిషి. ఏది మంచిదో ఎంచుకోవాలి. అది కష్టమేం కాదు, తమ అనుభవాలే తేల్చి చెబుతున్నాయి.

తమ అనుభవాలలో కరువులున్నాయి, వర్షాలు కురవక పోవడమో, తక్కువగా కురవడమో, అవసరం లేనప్పుడు అదే పనిగా కురవడమో వున్నాయి. పంట వేసేటప్పుడు ఆకాశాన వుండే ధరలు పంట వచ్చినాక నేలన పడిన అనుభవాలున్నాయి. చిన్న కొట్లాటకు ఖూనీలు చేసుకున్న అనుభవాలున్నాయి. ఇప్పుడు ముఠానాయకులొచ్చినారు, జనం వుసురుపోసుకుంటూ.......... రాయలసీమను రాళ్ళసీమగా కూడా వుండనియ్యకుండా బాంబుల సీమగా మార్చినారు. ఇవన్నీ ఇక్కడోళ్ళందరికీ తెలిసినవే. ఇవన్నీ వెనుకబడిన ప్రాంతంలో వుండేవని, అందరికీ కాకపోయినా కొందరికైనా తెలుసు.

అయితే, ఇంతకన్నా వెనుకబడినతనం ఒకటి ఎప్పట్నుంచో ఇక్కడున్నట్టు ఇప్పటికీ ఎవరికీ తెలిసినట్టులేదు. అదేదో చెబితే, "ఇండ్లల్లో పసులుండడమూ, భార్యాభర్తలకు గదుల్లేకపోవడమూ వెనుకబడినతనమా? విచిత్రం కాకపోతే" అనొచ్చు. భార్యాభర్తలంటే ఎవరు? మనుషులేగదా? మనుషులేనని ఒప్పుకుంటే........... "పశువులతో కలిసే వుండినాం, మనుషులం కలవకుండా వుండినాం" అని కూడా ఒప్పుకోవాలి. అప్పుడు ఎంత అసహజంగా వున్నట్లో అర్థమవుతుంది.

136/22

## కథ గురించి.......

ఒకసారి రంగనాయకమ్మ గారితో మాట్లాడుతున్నప్పుడు, రాయలసీమలో మనుషులు నివసించే ఇంట్లోనే పశువులుంటాయనీ, ఇంట్లో భార్యాభర్తలకు విడిగా గదులంటూ వుండవనీ చెబితే, ఆమె ఎంతో ఆశ్చర్య పోయారు. ఆ ఆశ్చర్యంలోనే ఎన్నో వివరాలడిగారు. నాకు తెలిసిన వివరణ ఇచ్చినా ఆమె సంతృప్తి చెందలేదు. ఆర్థిక వసతీ, స్థల వసతీ వున్నవాళ్ళు కూడా అలా ఎందుకుండాలన్నది ఆమె సందేహం.

అప్పట్నించీ ఆ అంశంపై కథరాయాలన్న ఆలోచన కలుగుతూ వచ్చింది. ఈ కథలో చిత్రించిన పరిస్థితి రెండు దశాబ్దాల క్రిందటిది. ఇప్పుడు చాలా గ్రామాలకు విద్యుత్ సౌకర్యం ఏర్పడింది. ఆ ఒక్క తేడా తప్పితే, మిగతా పరిస్థితి అంతా అలాగే వుందనుకుంటున్నాను. అంటే, పశువులు కాపురం వుండే ఇళ్ళలో వుండటమూ, ఇంట్లో ఎవరికీ విడిగా గదుల్లేక పోవడమూ అనేవి. ఎక్కడైనా ఇందుకు వ్యతిరేకమైన పరిస్థితి ఇప్పుడు వుండొచ్చునేమో కానీ, సాధారణ పరిస్థితి అదేనని చెప్పవచ్చు.

ఆ పరిస్థితిని సమర్థించడానికి వీల్లేదు. కాకపోతే, అందుకు కారణాలను ఊహించగలం. ఊహించగలమంటే శాస్త్రీయమైనవి కాకపోవచ్చని సూచించడమే. అనుభవాలను ఆధారం చేసుకున్న అన్వేషణ ఇది. ఆ అన్వేషణకు ఆధునిక జీవితానికి ఇవ్వతగిన ముగింపు ఇవ్వక తప్పదు. 'వార్త' ఆదివారం అనుబంధం 6-7-'97, 13-7-'97 సంచికలలో ఈ కథ ప్రచురణ అయింది. ఆ తర్వాత, కథను మరింత పెంచాను, కొద్దిపాటి మార్పులూ చేసాను.

8151